దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి అన్నారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్‌ నాగర్జుననగర్‌ కాలనీలో ఇంజినీరింగ్‌ అధికారులతో కలిసి పర్యటించారు. శిథిలమైన అంతర్గత రోడ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కాలనీలో మంచినీటి, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యను స్థానికులు కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏఈ కీర్తి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌, నాగిళ్ల బాల్‌రెడ్డి, పోచయ్యగౌడ్‌, కాసుల అంజయ్యగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేత

డివిజన్‌ పరిధిలోని శ్రీరామ్‌ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీ సమస్యలపై కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో మిగిలిపోయిన డ్రైనేజీ నిర్మాణ పనులు, వీధి దీపాలు, విద్యుత్‌ స్తంభాలు తదితర సమస్యలను కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లారు.

సఫిల్‌గూడ చెరువును అభివృద్ధి చేస్తాం

- మేయర్‌ విజయలక్ష్మి
- అధికారుల తీరుపై అసంతృప్తి
- పద్ధతి మార్చుకోండి.. లేదా మార్చేస్తా అని డీఈకి హెచ్చరిక


గుర్రపు డెక్క గురించి మాట్లాడుతున్న మేయర్‌ విజయలక్ష్మి

మల్కాజిగిరి: సఫీల్‌గూడ చెరువు, లేక్‌పార్కును అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని మేయర్‌ విజయలక్ష్మి అన్నారు. కార్పొరేటర్‌ శ్రవణ్‌ సఫీల్‌గూడ చెరువులో పేరుకపోయిన గుర్రపు డెక్కతో ఇటీవల కౌన్సిల్‌ సమావేశంలో నిరసన వ్యక్తం చేశాడు. ఆయన విజ్ఞప్తి మేరకు కమిషనర్‌ ఆమ్రపాలితో కలిసి శుక్రవారం చెరువును పరిశీలించారు. పేరుకపోయిన గుర్రపు డెక్క, చెత్తాచెదారం, విరిగిపోయిన చిన్నపిల్లల ఆట వస్తువులు, ఆడుకునే ప్రాంతంలో ఇసుక లేకపోవడాన్ని గమనించి ఇంజినీరింగ్‌ విభాగం డీఈ మహేశ్‌పై మేయర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీ రాజు, ఎంటమాలజీ విభాగం అధికారులు గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు మెమో జారీ చేస్తానని హెచ్చరించారు. వినాయక నిమజ్జనం పాండ్‌తో పాటు విరిగిన ఆట వస్తువుల పరిసరాలను 15 రోజుల్లో సరిదిద్దాలని ఆదేశించారు. అధికారులు అవకాశం ఉన్న మేరకు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు రాకుండా అధికారులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నడూ కనిపించని విధంగా శుభ్రం

మేయర్‌ పర్యటన ముందస్తు సమాచారం తెలుసుకున్న శానిటేషన్‌ విభాగం ఉన్నతాధికారులు మేయర్‌ పర్యటించే ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఆయా ప్రాంతాల్లో ఎన్నడూ కనిపించని విధంగా పరిశుభ్రంగా ఉండటాన్ని చూసి స్థానిక ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎల్లప్పుడు ఇలా పరిశుభ్రంగా ఉంటే బాగుండని పలువురు చర్చించుకున్నారు

ఐవీసీ విద్యార్థులకు 16,18న కౌన్సెలింగ్‌

రామంతాపూర్‌ : ఇంటర్‌ ఒకేషనల్‌ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్‌ డిప్లొమా కోర్సుల్లో నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశానికి జూలై 16, 18వ తేదీల్లో కౌన్సెలింగ్‌ జరుగనుంది. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ వినయ్‌కుమార్‌ ఒక ప్రకటన విడుదల చేశారు. కౌన్సెలింగ్‌ కళాశాలలో జరుగనుందని ఆయన తెలిపారు.

సెల్‌ఫోన్‌ లింక్‌లను ఓపెన్‌ చేయొద్దు


అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌కుమార్‌

మల్లాపూర్‌: సెల్‌ఫోన్‌లో వచ్చే లింక్‌లను ఓపెన్‌ చేయవద్దని నాచారం ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం నాచారం హబ్సిగూడలోని శ్రీ మేధా జూనియర్‌ కళాశాలలో సైబర్‌ క్రైమ్‌, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్‌ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలను కూడా ఎవ్వరికి చెప్పవద్దని సూచించారు. సైబర్‌ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో మొక్కల పంపిణీ


మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్‌ సిబ్బంది

మేడిపల్లి: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీర్జాదిగూడ నగరపాలక పరిధిలోని పలు కాలనీల్లో మొక్కలు నాటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగుతుందని మున్సిపల్‌ కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. పూల మొక్కలు, పండ్ల మొక్కలను పెంచుకొనుటకు ఆసక్తి ఉన్నవారు వార్డు ఆఫీసర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధుల నివారణ

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

గౌతంనగర్‌: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గౌతంనగర్‌ డివిజన్‌ సంజయ్‌నగర్‌ సిద్ధార్థ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమానికి కార్పొరేటర్‌ మేకల సునీతరాముయాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం క్షీణించి దోమలు వృద్ధి చెంది విషజ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి


బాధ్యతలను స్వీకరిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

బోడుప్పల్‌: న్యూ సాయి మారుతీనగర్‌ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు వి. రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.మల్లేష్‌ అన్నారు. శుక్రవారం ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌ నుంచి ఆలయ తాళాలు తీసుకుని బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సంతోష్‌చారి, కోశాధికారి దుర్గారెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో 28న బంగారు మైసమ్మ బోనాలు

బోడుప్పల్‌: బోడుప్పల్‌లో బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలను ఈనెల 28వ తేదీన నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. బంగారు మైసమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం జరిగిన సమావేశంలో పలువురి అభిప్రాయాలను సేకరించి నిర్ణయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌, బోడుప్పల్‌ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు తోటకూర అజయ్‌ యాదవ్‌, చీరాల నర్సింహ, నేతలు రాపోలు చిన్న కిష్టయ్య, లక్ష్మారెడ్డి, రమేష్‌, పులకండ్ల జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న గ్రామపెద్దలు

బాక్సర్‌ వెంకటేశం కన్నుమూత


బాక్సర్‌ వెంకటేశం

రామంతాపూర్‌: ఆర్టీసీ కాలనీకి చెందిన బాక్సింగ్‌ క్రీడాకారుడు నాస్‌ వెంకటేశం (77) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వెంకటేశం రాష్ట్ర, జాతీయ బాక్సింగ్‌ పోటీల్లో పలు పతకాలను సాధించారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌, కాంగ్రెస్‌ ఉప్పల్‌ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, బీఆర్‌ఎస్‌, బీజేపీ నేతలు సంతాపం తెలిపారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతి

గౌతంనగర్‌: గౌతంనగర్‌ లెవెల్‌ క్రాసింగ్‌ వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్‌ మేకల సునీతరాముయాదవ్‌ శుక్రవారం ఎంపీ ఈటల రాజేందర్‌ని కలిసి వినతిపత్రం అందచేశారు. గౌతంనగర్‌ గేట్‌ వద్ద నిత్యం గేట్‌ పడుతుండటంతో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు, అత్యవసర వాహనాలు గంటల తరబడి నిరీక్షిస్తున్నాయన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

కళాకారులను ప్రోత్సహించాలి


డాక్టర్‌ అలేఖ్య పుంజాలను సత్కరిస్తున్న డాక్టర్‌ ఎస్పీ భారతి

గౌతంనగర్‌: తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలను సంరక్షిస్తున్న రాష్ట్ర కళాకారులను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్‌ ఎస్పీ. భారతి అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్‌ అలేఖ్య పుంజాలను ఆమె సత్కరించారు.

ఆషాఢమాస గోరింటాకు ఉత్సవం


చేతులపై వేసుకున్న గోరింటాకును చూపేడుతున్న మహిళలు

మల్లాపూర్‌: సూర్యనగర్‌ కాలనీ శ్రీలక్ష్మీజ్యోతి మహిళా మండలి, ధర్మ జాగరణ సభ్యుల సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. ఒకరికొకరు గోరింటాకును చేతులపై వేసుకున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


రాంనగర్‌ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ శాంతి

అల్వాల్‌: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అల్వాల్‌ డివిజన్‌ రాంనగర్‌కాలనీ, పంజాబ్‌ కమ్యూనిటీహాల్‌ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, చెత్తాచెదారాన్ని, బిల్డింగ్‌ మెటీరియల్‌ వ్యర్థాల కుప్పలను తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు రంజిత్‌రెడ్డి, ఇస్తారి, శేఖర్‌, ఎస్‌ఎఫ్‌ఏలు భాస్కర్‌, వెంకటేష్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు మల్లేష్‌గౌడ్‌, యాదగిరిగౌడ్‌, ప్రవీణ్‌, రహమత్‌ఖాన్‌, ఆరీఫ్‌ఖాన్‌, పోచయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


నీరు పోస్తున్న కమిషనర్‌ రామలింగం

బోడుప్పల్‌: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బోడుప్పల్‌ కమిషనర్‌ రామలింగం అన్నారు. బోడుప్పల్‌ ప్రివిలేజ్‌ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగర పాలక సంస్థను హరితవనంగా మార్చేందుకు మొక్కలు నాటుదామని పిలుపునిచ్చారు. నగర పౌరులందరూ తమ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం ఫ్రై డే- డ్రై డే పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్‌, కొత్త చందర్‌గౌడ్‌. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాబోధిలో ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

అల్వాల్‌: వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత దంత, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌ భవానీ మాట్లాడుతూ.. వైద్యులు సూచించిన సలహాలు, సూచనలపై విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, శరత్‌చంద్ర, పాఠశాల పరిపాలనాధికారి రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్‌ జాతీయ చైర్మన్‌ను కలిసిన నేతలు


రాజేష్‌ లియోటియను సత్కరిస్తున్న నేతలు

మల్లాపూర్‌: కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ సెల్‌ జాతీయ చైర్మన్‌ రాజేష్‌ లియోటియను శుక్రవారం నాచారానికి చెందిన నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జాతీయ స్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ సెల్‌ విభాగం చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించి సంత్‌గురు రవిదాస్‌ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మామిడాల సంతోష్‌రెడ్డి, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, సంతురవి దాస్‌ ధార్మిక సంఘటన కో ఆర్డినేటర్‌ ప్రమోద్‌ కుమార్‌, సదానందం, శ్యాంలాల్‌, వినోద్‌ సింగ్‌, కరణ్‌ సింగ్‌ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


నివాళులర్పిస్తున్న సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి

కాప్రా: బీజేఆర్‌ కాలనీకి చెందిన అంబాదాస్‌ మృతి పట్ల బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు రూ. 20 వేల ఆర్థికసాయం అందించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


కాలనీలో పర్యటిస్తున్న నాయకులు

అల్వాల్‌: నేరేడ్‌మెట్‌ డివిజన్‌ అమ్ముగూడ చంద్రబాబు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అణగారిన ప్రజా హక్కుల పోరాట కమిటీ, గద్దర్‌ అభిమానుల సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. శుక్రవారం కాలనీలో పర్యటించారు. కాలనీలో త్రాగునీరు, బోరు నీరు, ప్రతి ఇంటికి విద్యుత్‌, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలన్నారు. నీరు లేక కాలకృత్యాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సీఎల్‌ యాదగిరి, రమేష్‌, రాజయ్య, కృష్ణ, దాసు, యాదయ్య పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

గౌతంనగర్‌: వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా సంరక్షించడానికి దేవాలయాలు, మసీదుల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని మానవ సేవే- మాధవసేవ ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అపార్టుమెంట్‌లలో కూడా నీరు ఇంకుడు గుంతలోకి పోయే విధంగా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్‌, రమణ, బీఆర్‌ఎస్‌ నాయకులు రాముయాదవ్‌ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఉప్పల్‌: ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్‌ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరు గ్యారంటీలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంక్షేమ పథకాలను పేదలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకన్న, వినోద, పెద్ది స్వామి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పనుల పరిశీలన

ఉప్పల్‌: రెడ్డి, మున్నూరు కాపు శ్మశాన వాటిక ఆధునీకరణ పనులను శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు ఉప్పల్‌ పట్టణ పెద్దలు, శ్మశాన వాటిక కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. శ్మశాన వాటికలో సకల సౌకర్యాలను కల్పించి ముక్తి ఘాట్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేకల మధుసూదన్‌రెడ్డి, దుబ్బ నర్సింహారెడ్డి, గోనె అర్జున్‌రెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


పూలకుండీలో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న మున్సిపల్‌ సిబ్బంది

మేడిపల్లి: సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్‌ కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం నగర పరిధిలోని వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. గృహ, వాణిజ్య సముదాయాల్లో గల పాత టైర్లు, పూల కుండీల్లో నీరు ఉండకుండా శుభ్రపర్చుకోవాలన్నారు. నీటిలో దోమల లార్వ వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్‌ సిబ్బంది అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

నిండి పోతున్నా పట్టించుకోరా?



కాప్రా: సాయిబాబానగర్‌లోని వాటర్‌ రిజర్వాయర్‌ నుంచి నీరు వృథాగా పోతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతోనే రిజర్వాయర్‌ నుంచి ఇలా నీరు పొంగిపొర్లుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌ ద్వారా ఇళ్లకు సరఫరా చేయాల్సిన నీటిని అధికారుల నిర్లక్ష్యంతో కాలనీ రోడ్లపై ప్రవహిస్తుందని వాపోతున్నారు. సబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి నీటి వృథా చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డయల్‌ 100 పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్‌

మేడిపల్లి: అత్యవసర సమయంలో డయల్‌ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ అన్నారు. మేడిపల్లి జిల్లా పరిషత్‌ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్‌ నేరాలు, లైంగిక వేధింపులు, ట్రాఫిక్‌ నిబంధనలు, సామాజిక నేరాలను అరికట్టడంలో విద్యార్థుల పాత్ర, డయల్‌ 100 యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్‌ చిన్నం రాజు, అరుణ్‌, మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

మేడ్చల్‌ రూరల్‌: ఇంటికి వస్తున్నానని ఫోన్‌ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్‌ తెలిపిన మేరకు.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామానికి చెందిన శనిగరం వంశీ(21) మేడ్చల్‌ పట్టణంలోని శ్రీనగర్‌ కాలనీలో తోటి విద్యార్థులతో కలిసి నివాసం ఉంటూ మల్లారెడ్డి కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. ఈ నెల 11న సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటికి వస్తున్నానని కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చిన వంశీ ఇంటికి చేరుకోలేదు. బంధువుల ఇళ్లలో ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో తండ్రి భూపతి మేడ్చల్‌ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో వ్యక్తి మృతి

మేడ్చల్‌ రూరల్‌: డెంగీతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కాసింబాయి తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన భుక్యా రాజేందర్‌(38) గత కొంత కాలంగా అనారోగ్యానికి గురి కావడంతో పరీక్షలు నిర్వహించగా డెంగీ వ్యాధి బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించారు. గత గురువారం రాజేందర్‌ ఆరోగ్యం విషమించడంతో కుటుంబీకులు మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు దివ్యాంగుడు కాగా అతనికి భార్య, కుమార్తె ఉన్నారు.